క్లుప్తంగా

పట్టణాన్ని నందనవనంగా మారుస్తాం



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణాన్ని నందనవనంగా మారుస్తున్నామని రాష్ట్ర ఎక్సైజ్, క్రీడల శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ చెప్పారు. బుధవారం షాషాబ్‌గుట్ట నుంచి మర్లు, బైపాస్ వరకు కలిపేలా రూ.పది లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్డు, డ్రెయినేజీ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం మినీ ట్యాంక్‌బండ్, నెక్లెస్ రోడ్డు పనులను పరిశీలించారు. వార్డు నంబర్ 40లో తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, ముడా చైర్మన్ గంజి వెంకన్న, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ తేజాస్ నందులాల్ పవార్, ఎంఈఓ సుబ్రమణ్యం పాల్గొన్నారు.

నేడు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి రాక

హన్వాడ: మహబూబ్‌నగర్ జిల్లా పాలక్, మునుగోడు మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి గురువారం హన్వాడకు వస్తున్నట్లు మండల బీజేపీ అధ్యక్షుడు వెంకటయ్య, మండల నాయకుడు గుడ్డిమల్కాపూర్ రవిలు బుధవారం ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మండల నాయకులతో సమావేశం కానున్నట్లు వారు పేర్కొన్నారు.

వైభవంగా తిరుమలనాథ స్వామి బ్రహ్మోత్సవాలు

బాలానగర్: మండల పరిధిలోని పెద్దరేవల్లిలో నేటి నుంచి శ్రీ తిరుమలనాథ స్వామి బ్రహ్మోత్సవాలు జరగనున్నట్లు ఆలయ చైర్మన్ సాదు వెంకట్ రెడ్డి తెలిపారు. నాలుగు రోజుల పాటు జరగనున్న శ్రీ తిరుమలనాథ బ్రహ్మోత్సవాల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు. మొదటి రోజు శ్రీ తిరుమలనాథ స్వామి కల్యాణోత్సవం, 6వ తేదిన రథోత్సవం, 7వ తేదిన శకటోత్సవం, 8వ తేదిన చక్రతీర్థం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమల నిర్వాహణ కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.

మహాజన సోషలిస్టు పార్టీ ఆవిర్భావ దినోత్సవం



జడ్చర్ల టౌన్: మహాజన సోషలిస్టు పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎర్రసత్యం స్మారక బస్టాండ్ ఎదురుగా ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ జంగయ్య మాదిగ జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ వినోద్‌మాదిగ, నాయకులు భీంరాజ్, యాదయ్య, రాంచంద్రయ్య, భీమయ్య, నరేందర్, శేఖర్, బాలస్వామిలు పాల్గొన్నారు.

ఏఎంసీ అభివృద్ధికి కృషి

బాలానగర్: వ్యవసాయ కమిటీ అభివృద్ధికి కృషి చేద్దామని ఏఎంసీ చైర్మన్ రజని అన్నారు. బుధవారం మండల పరిధిలోని పెద్దాయపల్లి శివారులోని ఏఎంసీ కార్యాలయంలో డైరెక్టర్లతో కలిసి సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మార్కెట్ కమిటీలో రూ.26 లక్షల 80 వేల నగదు నిల్వ ఉందని, మార్కెట్‌యార్డుకు ఆదాయం పెంచేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ నారాయణ రెడ్డి, సర్పంచ్ శంకర్, డైరెక్టర్లు మల్లేష్, మనోహర్ రెడ్డి, బోయ శ్రీశైలం, జి.నర్సింలు, శంకర్ నాయక్, కె.నర్సింలు, మోహన్ రెడ్డి, మల్లేష్ గౌడ్, శ్రీనివాస్, అల్లె తిరుపతి, రాములు నాయక్ పాల్గొన్నారు.

ఎంపీ నిధులతో డ్రెయినేజీ పనులు

నవాబుపేట: మండల పరిధిలోని దరిపల్లిలో ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి తన నిధుల నుంచి రూ.10 లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ ఏర్పాటుకు నిధులు మంజూరు చేశారు. బుధవారం ఈ పనులను ప్రారంభించారు. అండర్ గ్రౌండ్ డ్రెయినేజీని ఏర్పాటు చేయడంతో ప్రజలు ఎంపీని అభినందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు రవిందర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ నర్సింహులు, మార్కెట్ చైర్మన్ లక్ష్మయ్య, దరిపల్లి సర్పంచ్ వెంకటేష్, బీఆర్ఎస్ నాయకులు ప్రతాప్, రవి, శ్రీనివాస్, వెంకటయ్య, పురుషోత్తం, రాంరెడ్డి, జంగయ్య తదితరులు ఉన్నారు.

7న టాలెంట్ టెస్ట్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా సోషల్ స్టడీస్ టీచర్స్ ఫోరం ఆధ్వర్యంలో ఈనెల 7న ఎస్సెస్సీ విద్యార్థులకు సోషల్ టాలెంట్ టెస్టును నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చెన్నప్ప, శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని క్రౌన్ గార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో ఉదయం 10:30 గంటలకు పరీక్ష నిర్వహిస్తామన్నారు. పాఠశాలలో మీడియం నుంచి ఇద్దరు విద్యార్థులు హాజరుకావాలని తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వారికి నగదు పురస్కారం అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

ప్రమాదమని తెలిసినా..

- ప్రకృతి వనాల్లో, రహదారికి ఇరువైపులా విరివిగా పెంచుతున్న 'కోనోకార్పస్'
- శ్వాసకోశ వ్యాధులకు అవకాశం
- పట్టించుకోని అధికారులు



అడ్డాకుల పల్లె ప్రకృతి వనంలో ఏపుగా పెరిగిన కోనోకార్పస్ మొక్కలు



అడ్డాకుల సర్వీస్ రోడ్డు పక్కన పెరిగిన కోనోకార్పస్ మొక్కలు

అడ్డాకుల: గ్రామాల్లో కోనోకార్పస్ మొక్కలు విరివిగా కనిపిస్తున్నాయి. చూడటానికి చాలా అందంగా కనిపించే ఈ మొక్కలు నచ్చనివారు ఉండరు. పల్లె ప్రగతిలో భాగంగా గ్రామాల్లోని పల్లె ప్రకృతి వనాలు, ప్రభుత్వ కార్యాలయాలు, రహదారుల వద్ద కోనోకార్పస్ మొక్కలను నాటడంతో అవి పెరిగి పెద్దవయ్యాయి. శాస్త్రీయంగా ఈ మొక్కలు చాలా ప్రమాదకరమైనవని కొన్నాళ్ల కిందట ప్రభుత్వం గుర్తించింది. కొత్తగా ఈ మొక్కలను నాటడాన్ని కూడా ప్రభుత్వం నిషేధించింది. అయితే గ్రామాల్లో ఈ మొక్కల మూలంగా జరిగే నష్టాల గురించి అవగాహన లేకపోవడంతో ఇంకా నీళ్లు పోసి పెంచుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రకృతి వనాల్లో పెంచడం ద్వారా ఎక్కడ చూసినా ఇవే మొక్కలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం ఏపుగా పెరిగిన మొక్కల పరిస్థితి ఏంటన్నది ఎటు తేలకుండా ఉంది.

శ్వాసకోశ వ్యాధులొస్తాయని..!

కోనోకార్పస్ మొక్కలు వెదజల్లే పుప్పొడితో వివిధ రకాల శ్వాసకోశ సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. మన వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పెరిగే మొక్కలకు వీటి ద్వారా వాటి మనుగడకు ముప్పు ఏర్పడుతోందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ఈ మొక్కలు అధిక సంఖ్యలో భూగర్భ జలాలను వినియోగిస్తాయంటున్నారు. అందం, ఆకర్షణ తప్పా.. కనీసం పక్షులు గూళ్లు కట్టుకోవడానికి కూడా ఇవి ఉపయోగపడవు. గ్రామాల్లో కొంత పరిజ్ఞానం ఉన్న వారు ఈ మొక్కలను ఎప్పుడు తొలగిస్తారని ఎదురు చూస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి గ్రామాల్లో ఇళ్లు, కార్యాలయాలు, రోడ్ల పక్కన ఉన్న కోనోకార్పస్ మొక్కలను తొలగించి వాటి స్థానంలో ఇతర రకాల మొక్కలను నాటే విధంగా చేయాల్సిన అవసరముందని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

బీఆర్ఎస్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం



ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన ఆయా పార్టీల నాయకులు

కోయిల్‌కొండ: బీఆర్ఎస్‌తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని నారాయణపేట ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో రూ.60 లక్షలతో బటర్ ఫ్లై లైట్లు నిర్మాణం, తహసీల్దార్ కార్యాలయ భవన మరమ్మతుల కోసం కలెక్టర్ వెంకట్రావ్‌తో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేశారు. అనంతరం రైతువేదికలో కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ శశికళ; జెడ్పీటీసీ సభ్యుడు విజయ్‌భాస్కర్‌రెడ్డి, ఖాజీపూర్ సర్పంచ్ కల్పన సర్పంచ్ కరుణాకర్‌రెడ్డి, తహసీల్దార్ ప్రేమ్ రాజ్, ఎంపీడీఓ జయరాములు, శ్రీనివాస్‌రెడ్డి, మల్లయ్య, మాదవులు, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు..

రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో చేస్తున్న అభివృద్ధిని చూసి ఇతర పార్టీల నుంచి పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్‌లోకి వస్తున్నారని ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని శేరివెంకటాపూర్ ఎమ్మెల్యే నివాసంలో ఆయా పార్టీలకు చెందిన కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో చేరారు. అలాగే మండల పరిధిలోని మల్కాపూర్‌కి చెందిన చెల్లపురం శశిధర్‌రెడ్డి సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేసి బుధవారం ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి సమక్షంలో తన అనుచరులతో కలిసి బీఆర్ఎస్‌లో చేరారు. ప్రజలకు సేవచేయాలనే అంకిత భావంతో ఉద్యోగానికి రాజీనామా చేసినట్లు ఆయన తెలిపారు.

చంద్రశేఖరేంద్ర శతకం పుస్తకావిష్కరణ

అడ్డాకుల: మండలంలోని రాచాలకి చెందిన తెలుగు ఉపాధ్యాయుడు జేఎం చంద్రశేఖరస్వామి రచించిన చంద్రశేఖరేంద్ర శతకం పుస్తకావిష్కరణ కార్యక్రమం ఏపీలోని కర్నూల్ జిల్లా శ్రీశైలం దేవస్థానం వద్ద బుధవారం జరిగింది. దేవస్థానం పూర్వ ప్రధానార్చకులు, వీరశైవ గురుకుల సంస్థాపకులు, లింగైక్య చంద్రశేఖర శివాచార్య స్వామి వారి జీవిత విశేషాలను వారి పరోపకార గుణాన్ని వర్ణిస్తూ చంద్రశేఖరేంద్ర శతకం పుస్తకాన్ని ఆయన రచించారు. శ్రీశైలంలోని వీరశైవ గురుకుల రజతోత్సవ కార్యక్రమం సందర్భంగా పుస్తకావిష్కరణ చేయించినట్లు తెలిపారు. శ్రీశైల జగద్గురువు, బార్శి గురువు మణికంఠశివాచార్య, ప్రధానాచార్యులు మల్లికార్జునస్వామి, దేవస్థానం ఈఓ లవన్న, ఇతర ప్రముఖులతో పుస్తకావిష్కరణ చేయించినట్లు ఆయన పేర్కొన్నారు.

పంచాయతీ కార్మికుల వేతనాలు పెంచాలి



మాట్లాడుతున్న కురుమూర్తి

అడ్డాకుల: గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న కార్మికుల వేతనాలు పెంచాలని పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు నల్లవెల్లి కురుమూర్తి డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మండలంలోని వివిధ గ్రామ పంచాయతీలతో పాటు రాచాలలో పంచాయతీ కార్మికులను కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. పంచాయతీల్లో వేతనాల బకాయిలు ఉన్నాయని, వచ్చే జీతాల్లో కూడా కోత విధిస్తున్నారని, కార్మికులు వాపోతున్నట్లు కురుమూర్తి తెలిపారు. కార్మికులతో రోజుకు 10 నుంచి 12 గంటలు పని చేయించుకుంటున్నారని తెలిపారు. కార్మికులకు ప్రమాదాలు జరిగితే పరిహారం అందడం లేదని, తక్షణమే వారికి రూ.10లక్షల బీమాను వర్తింపజేయాలని విజ్ఞప్తి చేశారు. కార్మికులపై పని ఒత్తిడి తగ్గించి వేధింపులను ఆపాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను దృష్టిలో పెట్టుకుని వారికి ప్రతి నెలా జీతాలు అందే విధంగా చూడాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకుడు సయ్యద్ జాహంగీర్ ఉన్నారు.

లోకకల్యాణార్థం నవగ్రహ రుద్రహోమం



జడ్చర్ల టౌన్: మండలంలోని శ్రీగిరిక్షేత్రం అష్టలక్ష్మి ఆలయంలో బుధవారం లోకకల్యాణార్థం ఆచార్య కృష్ణస్వామి నేతృత్వంలో లక్ష్మీనారాయణ నవగ్రహ రుద్ర హోమం నిర్వహించారు. ధనుర్మాసం రోహిణి నక్షత్రం పురస్కరించుకుని ఆలయంలో అమ్మవారికి పూజలు, అభిషేకం చేసిన అనంతరం నవగ్రహరుద్ర హోమం జరిపించారు. హోమంలో వెంకటేశ్వరం సవిత దంపతులతోపాటు బుక్క నారాయణ, యాదిరెడ్డి, తిరుపతయ్య, రాంచంద్రారెడ్డి, చంద్రయ్య పాల్గొన్నారు.

రిలే నిరాహార దీక్షకు మద్దతు



మద్దతు తెలుపుతున్న నాయకులు

భూత్పూర్: మున్సిపాలిటీలోని సిద్ధాయిపల్లి వద్ద నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను అర్హులకు ఇవ్వకుండా ఇతరులకు అందజేశారని, అర్హులకు డబుల్ బెడ్రూం ఇళ్లు ఇచ్చేవరకు పోరాటాలు చేస్తామని బీజేపీ నాయకుడు సుదర్శన్‌రెడ్డి, ఎగ్గని నర్సింహులు అన్నారు. బుధవారం స్థానిక మున్సిపాలిటీలోని అమిస్తాపూర్‌లో బీజేపీ నగర శాఖ ఆధ్వర్యంలో నిరసన దీక్షలు చేపట్టారు. దివిటిపల్లి వద్ద నిర్మించిన ఇళ్లను సైతం టీఆర్ఎస్ నాయకులు కమీషన్లకు కక్కుర్తితో అనర్హులకు ఇచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఫారఖ్, రాజ్‌గోపాల్‌రెడ్డి, రాజు, నర్సింహారెడ్డి, సదానంద్ గ్రామస్తులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం విజయవంతం

నవాబుపేట: మండల కేంద్రంలో బుధవారం సీనియర్ సిటిజన్ ఫోరం, రాంరెడ్డి కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా శిబిరంలో 149 మంది ఉచితంగా పరీక్షలు చేసుకుని కావాల్సిన మందులను ఉచితంగా పొందారు. అలాగే 14 మందికి ఆపరేషన్ల కోసం ఉచితంగా రాంరెడ్డి ఆసుపత్రికి తరలించేందుకు సీనియర్ సిటిజన్ ఫోరం ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కాగా ఈ ఉచిత శిబిరాన్ని సీనియర్ సిటిజన్ ఫోరం మండల అధ్యక్షుడు చిగుళ్లపల్లి నర్సింహులు ప్రారంభించారు. కాగా ఈ శిబిరానికి వచ్చిన వారికి కూచూరి శంకరమ్మ జ్ఞాపకార్థం ఆమె కుమారుడు చిన్నస్వామి భోజన ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ బుచ్చన్న, సిటిజన్ ఫోరం నాయకులు బచ్చు రామకృష్ణ, బర్మని విజయ్‌కుమార్, వేణునాథం, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులకు దుస్తుల పంపిణీ



వెన్నాచేడ్‌లో పంచాయతీ కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న సర్పంచ్

గండేడ్: గ్రామాల్లో పారిశుద్ధ్య కార్మికుల సేవలు అభినందనీయమని వెన్నాచేడ్ సర్పంచ్ పుల్లారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని వెన్నాచేడ్‌లో పంచాయతీ కార్మికులకు దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్య పనుల్లో మెరుగైన సేవలు అందించి సంపూర్ణ ఆరోగ్యానికి తోడ్పడుతున్నారని అన్నారు. గతంలో ఇలాంటి పరిస్థితులు లేకపోవడంతో గ్రామాల్లో అతిసార, డయేరియా వంటి రోగాలు వచ్చేవన్నారు. పంచాయతీ కార్మికుల సేవలు ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఖలీం, కారోబార్ పులిందర్‌రెడ్డి, పంచాయతీ కార్మకులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ క్రీడా పోటీల్లో ప్రతిభ చాటాలి

మహబూబ్‌నగర్ క్రీడలు: నేటి నుంచి మహబూబ్‌నగర్‌లో జరిగే పాలిటెక్నిక్ క్రీడా పోటీల్లో కళాశాల జట్టు ప్రతిభ చాటాలని జేపీఎన్‌సీఐ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ యూఈ.చంద్రశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా పోటీల్లో పాల్గొనే కళాశాల జట్టును బుధవారం ఆయన అభినందించారు. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, అథ్లెటిక్స్‌లో పాలిటెక్నిక్ జట్టు పాల్గొంటున్నట్లు తెలిపారు. పోటీల్లో రాణించి పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పీడీ ఉమామహేష్, భూషణ్ పాల్గొన్నారు.

మెనూ ప్రకారం పౌష్టికాహారం



పాచర్లతండాలో పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు విజయనిర్మల

హన్వాడ: అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం పంపిణీ చేసే పౌష్టికాహారాలను మెనూ ప్రకారం అందించాలని జెడ్పీటీసీ సభ్యురాలు విజయనిర్మల సూచించారు. బుధవారం ఆమె మండలంలోని మాదారం, అమ్మాపూర్, కిష్టంపల్లిగేట్‌తండా, పాచర్లతండాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాలకు మంజూరైన పౌష్టికాహారాలను పరిశీలించి చిన్నారులు, గర్భిణి, బాలింతలకు పంపిణీ చేశారు. ఆమె వెంట అంగన్‌వాడీ సూపర్‌వైజర్ గీత, కిష్టంపల్లిగేట్ తండా సర్పంచ్ లక్ష్మీ, జిల్లా రైతుబంధు సమితి డైరెక్టర్ రమణారెడ్డి, అంగన్‌వాడీలు, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతో ముందుకుసాగాలి



లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకల్లో మాట్లాడుతున్న డీడబ్ల్యూఓ జరీనాబేగం

మహబూబ్‌నగర్ రూరల్: అంధులు అన్ని రంగాల్లో రాణించాలని మహిళా, శిశు సంక్షేమశాఖ జిల్లా అధికారి జరీనాబేగం అన్నారు. బుధవారం పాత ఐసీడీఎస్ కార్యాలయంలో లూయిస్ బ్రెయిలీ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా డీడబ్ల్యూఓ మాట్లాడుతూ అంధులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని, ప్రభుత్వం కల్పించే సౌకర్యాలతో అన్ని రంగాల్లో విజయం సాధించాలని ఆకాంక్షించారు. యావత్తు ప్రపంచంలోని అంధులకు బ్రెయిలీ లిపి కనుగొన్న లూయిస్ బ్రెయిలీ మార్గదర్శకుడు అని అన్నారు. ప్రపంచంలోని అంధుల కోసం ఏదో ఒకటి మేలు చేకూర్చాలనే తపనతో బ్రెయిలీ లిపిని కనుగొన్నారని, ఆ లిపి నేడు ప్రపంచంలోని అంధులందరికీ ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. సామాన్య మానవుల మాదిరిగానే వారు కూడా జీవించడానికి బ్రెయిలీ లిపి ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. ఉమెన్ పీఎస్ సీఐ హన్మప్ప మాట్లాడుతూ అంధులు తమ ప్రతిభతో అనేక మందికి మార్గదర్శకులు అవుతున్నారని తెలిపారు. వివిధ రంగాల్లో సామాన్య ప్రజానీకానికి దీటుగా తమ ప్రతిభను చాటుతున్నారని కొనియాడారు. కార్యక్రమంలో మాస్ మీడియా అధికారి డాక్టర్ వేణుగోపాల్, ప్రిన్సిపాల్ వంగ రాములుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త నిరసనలు జయప్రదం చేద్దాం

జడ్చర్ల టౌన్: ఈనెల 6న దేశవ్యాప్తంగా చేపట్టిన నిరసనలు జయప్రదం చేద్దామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి తెలుగు సత్తయ్య పిలుపునిచ్చారు. నిరసనలు జయప్రదం చేసేందుకు బుధశారం సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8ఏళ్లు గడిచినా నేటికి స్కీం వర్కర్ల సమస్యలు పరిష్కారం చేయటంలో పూర్తిగా విఫలం అయ్యిందన్నారు. స్కీం వర్కర్ల సమస్యలపై 6న తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నాకు తరలిరావాలని పిలుపునిచ్చారు.

చీకటిని జయించి..

- పీహెచ్‌డీ పూర్తిచేసిన అంధ ఉపాధ్యాయుడు
- చేయూతనిస్తే అంధత్వం ఆటంకం కాదని నిరూపణ



ఉపాధ్యాయుడు రాఘవేందర్‌రెడ్డి కుటుంబం

మహబూబ్‌నగర్ రూరల్: చేయూతనిచ్చే వారుంటే.. అంధులు చేయలేనిది ఏదీ ఉండదని నిరూపించారు ఓ ప్రభుత్వ అంధ ఉపాధ్యాయుడు. అంధుల పట్ల జాలి చూపించకుండా చేయూతనందిస్తే ఎంతటి విజయాలనైనా అవలీలగా సాధించగలమని జిల్లాలోని జడ్చర్ల పట్టణానికి చెందిన బి.రాఘవేందర్‌రెడ్డి నిరూపించారు. చిన్నతనంలోనే అమ్మవారు సోకడంతో కంటి చూపు కోల్పోయిన అతను కృషి, పట్టుదలతో ఇంతింతై వాటుడింతై అన్న చందంగా ఎదిగారు. ఉపాధ్యాయ వృత్తిలో నైపుణ్యత సాధించిన ఆయన తన ప్రస్థానాన్ని పీహెచ్‌డీ పూర్తిచేయడం వరకు కొనసాగించి విజయం సాధించారు. తనకు చూపు లేకున్నా తనను ప్రోత్సహించే ఉస్మానియా విశ్వవిద్యాలయం సహాయ ఆచార్యులు డాక్టర్ ఎస్.రఘు మార్గదర్శకత్వంలో తెలుగు సాహిత్యంలో ప్రముఖ సినీగేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ సాహిత్యం సమకాలిన గేయ కవులు అనే అంశంపై పరిశోధన గ్రంథం సమర్పించి 2022 డిసెంబర్‌లో పీహెచ్‌డీ పూర్తి చేశారు. అంధత్వం చదువుకు ఆటంకం అయినా లెక్కచేయక అన్ని అవరోధాలను అధిగమించి ఒక్కొక్క మెట్టు ఎక్కుతూ పీహెచ్‌డీలో చేరి తన అనుకున్న లక్ష్యాన్ని సాధించగలిగారు. 1983 జూన్ 1వ తేదీన జడ్చర్ల పట్టణానికి చెందిన బి.హన్మంతురెడ్డి, వసంత దంపతులకు రాఘవేందర్‌రెడ్డి సామాన్య వ్యవసాయ కుటుంబంలో జన్మించిన ఆయన చిన్నతనంలోనే అమ్మవారు సోకడంతో కంటిచూపు కోల్పోయారు. తన కొడుకు అంధత్వానికి లోనవడం చూసి తల్లిదండ్రులు బాధపడుతున్న సమయంలో మహబూబ్‌నగర్ పట్టణంలో ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాలను 1988లో ప్రారంభించారు. ప్రత్యేకంగా అంధుల కోసం పాఠశాలను స్థాపించారని తెలుసుకున్న తల్లిదండ్రులు ఆయనను ఆ పాఠశాలను చేర్పించారు. 1988 నుంచి 1998 వరకు ఆ పాఠశాలలో బ్రెయిలీ లిపిలో పదో తరగతి వరకు విద్యనభ్యసించారు. ఆ సమయంలో పాఠశాలలోని ఉపాధ్యాయులు మిగతా విద్యార్థినీ, విద్యార్థులతో పాటు ఆయనకు కూడా సంగీతం, చేతివృత్తులు, వ్యాయామ, విద్య, మొబిలిటి లాంటి సహపాటే కార్యక్రమాలను కూడా నేర్పించారు. అలాగే వారు సమాజంలో ఎలా మసులుకోవాలో.. జీవితంలో ఎలా స్థిరపడాలో నేర్పించారు. ఆయన వారి సూచనలు, సలహాలను పరిగణలోకి తీసుకొని తమ తెలుగు ఉపాధ్యాయుడు డి.రాములు ప్రభావంతో పాఠశాల స్థాయి నుంచే తెలుగు సాహిత్యం పట్ల మక్కువ పెంచుకొని పాఠశాల విద్య అనంతరం హైదరాబాద్‌లోని ఆలియా కళాశాలలో ఇంటర్ పూర్తి చేశారు. అనంతరం మహబూబ్‌నగర్‌లోని డైట్ కళాశాలలో ఉపాధ్యాయ శిక్షణను పూర్తి చేసుకుని 2002–డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయుడిగా తన బోధన ప్రస్థానాన్ని ప్రారంభించారు. ఉపాధ్యాయుడిగా జడ్చర్ల మండలంలోని ఉదండాపూర్ గ్రామ పాఠశాలలో, ఆ తర్వాత ఖిల్లా ఘణపూర్ మోడల్ స్కూల్‌లో పనిచేసిన ఆయన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం నుంచి దూర విద్యా విధానం ద్వారా డిగ్రీని, ఉస్మానియా విశ్వవిద్యాలయం ద్వారా ఎంఏ బీఈడీ(తెలుగు) పూర్తి చేశారు. ఆ తర్వాత 2012లో యూజీసీ నిర్వహించిన నెట్ పరీక్ష రాసి జేఆర్ఎఫ్ ఫెలోషిప్‌కు ఎంపికయ్యారు. 2014లో ఓయూలో పార్ట్‌టైం పీహెచ్‌డీలో చేరిన ఆయన సుద్దాల అశోక్‌తేజ సాహిత్యం సమకాలిన సినీగేయ రచయితలు అనే అంశంపై పీహెచ్‌డీ పూర్తి చేశారు. అంధుల పట్ల జాలి చూపించక.. చేయూతనందిస్తే ఎలాంటి విజయాలనైనా అవలీలగా సాధించగలుగుతారని రాఘవేందర్‌రెడ్డి 'సాక్షి'తో తన అంతరంగాన్ని వెలిబుచ్చారు.

ఉపాధ్యాయ సంఘాల క్యాలెండర్ల ఆవిష్కరణ



ధర్మాపూర్‌లో క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ సుధాశ్రీ, పీఆర్‌టీయూ నాయకులు, ఉపాధ్యాయులు

మహబూబ్‌నగర్ రూరల్: మండల పరిధిలోని ధర్మాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఆర్‌టీయూ నూతన క్యాలెండర్‌ను ఎంపీపీ సుధాశ్రీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యావ్యవస్థను బలోపేతం చేసిందన్నారు. మండలంలోని పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు నారాయణగౌడ్, మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, వైవీ రావు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు హరినాథ్, నాగేశ్వర్‌రెడ్డి, చెన్నకిష్టయ్య, రాష్ట్ర బాధ్యులు సతీష్‌కుమార్, జిల్లా బాధ్యులు మధుసూదన్, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు, రమేష్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: యూటీఎఫ్ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను కలెక్టర్ వెంకట్రావ్ బుధవారం ఆవిష్కరించారు. ఈమేరకు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంలో ఉపాధ్యాయులు కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేష్, రవికుమార్, కోశాధికారి భాస్కర్ పాల్గొన్నారు.



నవాబుపేటలో క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు, ఉపాధ్యాయులు

నవాబుపేట: ఉపాధ్యాయ సంఘాలకు సంబంధించి నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎంఈఓ రాజు నాయక్ ఆవిష్కరించారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయం ఆవరణలో పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు సదాశివుడు, విజయ్‌కుమార్, నాయకులు కృష్ణయ్య, నర్సింహులు, శ్రీనివాస్‌రెడ్డి, అరుణ, విజయప్రతాప్, విజయ్, కృష్ణగౌడ్ తదితరులు ఉన్నారు.

అయ్యప్పస్వామికి పూజలు



నవాబుపేటలో ఇరుముడితో బయలుదేరిన అయ్యప్ప స్వాములు

జడ్చర్ల టౌన్: పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం గురుస్వామి సతీష్‌నాయర్ ఆధ్వర్యంలో మాలాధారులు ఇరుముడిధారణ వైభవంగా జరిగింది. ఆలయంలో అయ్యప్పస్వామికి పూజలు నిర్వహించి పల్లకీసేవ జరిపించారు. అయ్యప్పమాలాధారులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అయ్యప్పనామస్మరణ మధ్య ఇరుముడి ధారణ చేశారు. ఆలయానికి వచ్చిన గురుస్వామి సతీష్‌నాయర్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ దోరేపల్లి లక్ష్మి, టీఆర్ఎస్ నాయకులు రవీందర్‌లు కలిసి శాలువా, పూలమాలతో సత్కరించారు. ఇరుముడి అనంతరం అయ్యప్పస్వాములు ఊరేగింపుగా శబరిమలైకు బయలుదేరారు.

నవాబుపేట: మండల కేంద్రంలోని శివాలయంలో అయ్యప్ప స్వాములు బుధవారం ఇరుముడి ధరించి శబరియాత్రకు బయలుదేరారు. ఈ సందర్భంగా మండల కేంద్రం అయ్యప్ప నామస్మరణతో మార్మోగింది. 41 రోజులు దీక్ష పూర్తి చేసిన అయ్యప్పలకు గురుస్వామి ఇరుముడి కట్టించారు. అనంతరం మండల కేంద్రానికి చెందిన రాజేష్ అయ్యప్ప, భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమాల్లో గురుస్వాములు జంగయ్య,రవి, బ్రహ్మం, సునీల్, శేఖర్‌రెడ్డి, శివ, శ్రీనువాస్, సందీప్, శేఖర్, హన్మంత్ తదితరులు పాల్గొన్నారు.